TITLE CODE: APTEL16281

తెలుగు దినపత్రిక

# పీపుల్స్ మోటివేషన్

People's Motivation

ఆంధ్రప్రదేశ్ / తెలంగాణ

సంపుటి : 01 | సంచిక : 210 | ఎడిటర్ : ఎం. రమేష్ | సోమవారం, జులై 01, 2024 | పేజీలు : 04 | వెల రూ. 5.00/-

## ఓటు బ్యాంకే లక్ష్యంగా...

# నగదు బదిలీలు





**ఆర్థికస్థితిని దెబ్బతీసిన డబ్బుల పందేరం**

**జగన్ ఓటుబ్యాంక్ వ్యూహంతో రాష్ట్రం కుదేలు**

అమరావతి,జూన్30(పీపుల్స్ మోటివేషన్) :

వైఎస్ జగన్మోహన్ రెడ్డి వివిధ పథకాలతో ప్రజలను ఓటుబ్యాంక్‌గా మార్చుకునే యత్నంలో రాష్ట్రాన్ని దివాళా తీయించారు. ఐదేళ్లపాటు యధేచ్ఛగా సాగిన పందేరం ఇప్పుడు ఎపిని కోలుకోకుండా దెబ్బతీసింది. కేవలం తదుపరి అధికారం తనదే కావాలన్న లక్ష్యంతో పథకాలను అమలు చేసినా ఫలించలేదు. అయితే చేసిన నిర్వాకం వల్ల ఇప్పుడు ఎపి ఆర్థికంగా కోలుకోలేని దశకు చేరింది. ఓ వైపు విపక్ష టిడిపిని దెబ్బతీస్తూ, కేసులతో వారి క్యాడర్‌లో భయాలను పెంచడానికి మాత్రమే పోలీస్ వ్యవస్థను, అధికార వ్యవస్థను వాడుకున్నారు. మరోవైపు నేతలపై పలు కేసులను నమోదు చేసిన్న తీరు కేవలం ఓటుబ్యాంకును పదిలం చేసుకునేవిగా ప్రజలు గుర్తించారు. తెలుగుదేశం పార్టీని దెబ్బకొడితే రాజకీయంగా ఎదురు ఉండదన్న భ్రమలో జగన్ బోల్తాపడ్డారు. ఆయా సామాజికవర్గాల మద్దతు తనకు లభించేలా చేసిన విన్యాసాలు పనికి రాకుండా పోయాయి. హామీల అమలు పేరిట ప్రజాధనాన్ని జగన్మోహన్‌రెడ్డి పంచిపెట్టారు. విమర్శలు వచ్చినా జగన్ మాత్రం లెక్క చేయలేదు. ఇది క్విడ్‌ప్రో అని మాజీ ఎంపి ఉండవల్లి అరుణ్ కుమార్ లాంటి వారు టుగానే విమర్శించినా లెక్కచేయలేదు. దీనివల్ల ప్రజలలో తనకు మంచి పేరు వస్తుందన్న ధీమాలో ఆయన రాష్ట్రాన్ని గాడి తప్పించారు. ఇప్పుడు 14 లక్షల కోట్ల అప్పు ఉందని అంటున్నారు. ఇది తీర్చడం అంత ఆషామాషీ కాదు. తెలంగాణలో కెసిఆర్, ఎపిలో జగన్

(మిగతా 2వ పేజీలో..)

## అసెంబ్లీ ఎన్నికల్లో కూటమిగానే పోటీ చేస్తాం : శరద్ పవార్



ముంబై : అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్, ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని శివసేన కలిసి తమ పార్టీ పోటీ చేస్తుందని శరద్ చంద్ర పవార్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ చీఫ్ స్పష్టం చేశారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు ఈ ఏడాది అక్టోబర్‌లో జరుగనున్నాయి. లోక్‌సభ ఎన్నికల్లో భాగమైన రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో చిన్న మిత్రపక్షాల ప్రయోజనాలను పరిరక్షించడం మహారాష్ట్రలోని ప్రధాన ప్రతిపక్ష పార్టీల అనైతిక బాధ్యత అన్నారు. ఆయన ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్, శరద్ చంద్రపవార్ ఎన్‌సీపీ, ఉద్ధవ్ శివసనే ప్రతిపక్ష మహా వికాస్ అఘాడిలో కూటమిలో భాగం కాగా.. థాకరే నేతృత్వంలోని ప్రభుత్వం కూలిపోయే ముందు వరకు అంటే.. నవంబర్ 2019 నుంచి జూన్ 2022 వరకు మహా వికాస్ అఘాడి కూటమి అధికారంలో ఉన్నది. మహారాష్ట్రలో ప్రతిపక్షాలు ఐక్యంగా ఉంటాయని పవార్ అన్నారు. రాష్ట్రంలో మార్పు రావాల్సిన అవసరం ఉందని, దాన్ని నెరవేర్చాల్సిన నైతిక బాధ్యత ప్రతిపక్ష కూటమిదేనన్నారు. మహాభారతంలో అర్జునుడు చేపకన్నును లక్ష్యంగా గురి చూసి కొట్టిన విధంగా.. తమ కళ్లన్నీ మహారాష్ట్ర ఎన్నికలపైనే ఉన్నాయన్నారు. కాంగ్రెస్, ఎన్సీపీ, శివసేనలు కలిసి అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తాయన్న ఆయన.. రాష్ట్రంలో సీట్ల పంపకాలపై ఇంకా చర్చలు ప్రారంభం కాలేదన్నారు. ఈ విషయంలో త్వరలో చర్చ జరుగుతుందన్నారు. పార్టీల ప్రయోజనాలను కాపాడడం మన నైతిక బాధ్యత అన్నారు. ఈ సందర్భంగా ఏక్‌నాథ్ షిండే ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై అడిగిన ఓ ప్రశ్నకు ఆయన బదులిస్తూ.. 'మీరు ఖాళీ జేబులతో మార్కెట్‌కు వెళ్తే ఏం జరుగుతుంది' అంటూ ప్రశ్నించారు. బడ్జెట్‌లో ప్రభుత్వం 21 నుంచి 60 సంవత్సరాల మహిళలకు రూ.1500 భృతి, ప్రతి కుటుంబానికి మూడు ఉచిత ఎల్‌పీజీ సిలిండర్లు, రైతు అనుకూల చర్యలు, నైపుణ్య శిక్షణ కోసం యువతకు రూ.10వేలు చెల్లించనున్నట్లు సీఎం ప్రకటించారు.

## మ్యాచ్‌కే హైలైట్.. సూర్య సూపర్ క్యాచ్..



**బార్బడోస్ :** టీ20 ప్రపంచకప్‌లో మిస్టర్ 360 సూర్యకుమార్ యాదవ్ తన అద్వితీయమైన ఫీల్డింగ్‌తో అదరగొట్టాడు. బౌండరీ లైన్ వద్ద పాదరసంలా కదులుతూ విలువైన పరుగులు ఆపడమే కాదు చురుకైన క్యాచ్‌లు అందుకొని జట్టు విజయంలో కీలకపాత్ర పోషించాడు. దక్షిణాఫ్రికాతో జరిగిన ఫైనల్‌లో అంతర్జాతీయ టీ20 చరిత్ర ఎప్పటికీ నిలిచిపోయే క్యాచ్ అందుకున్నాడు. మ్యాచ్ నువ్వానేనా అన్నట్లు సాగుతున్నది. చివరి ఓవర్లో దక్షిణ్ఫ్రికా విజయానికి 16 పరుగులు అవసరమయ్యాయి. భారత హార్దిక్ పాండ్య బౌలింగ్ చేస్తున్నాడు. తొలి బంతికి హార్దిక్ వేసినలో ఫుల్‌టాస్‌ను బ్యాట్స్‌మెన్ డేవిడ్ మిల్లర్ లాంగాఫ్ దిశగా భారీ షాట్ ఆడాడు. అది సిక్సర్ వెళ్లేలా కనిపించింది. అయితే అక్కడికి కొద్దిదూరంలో ఫీల్డింగ్ చేస్తున్న సూర్య.. మెరుపు వేగంతో పరిగెత్తుకుంటూ వచ్చి బౌండరీ లైన్‌కు ఇంచు దూరంలో బాడీని బ్యాలెన్స్ చేసుకుంటూ రన్నింగ్ క్యాచ్‌ను అందుకున్నాడు. కానీ అప్పటికే బౌండరీ లైన్ ఆవలకు వెళ్తున్నానని గ్రహించిన సూర్య వెంటనే బంతిని గాల్లోకి ఎగిరేసి బౌండరీ లైన్ ఆవలకు వెళ్లి మళ్లీ లోపలికి వస్తూ పట్టిన క్యాచ్ ఈ మ్యాచ్‌కే హైలైట్‌గా నిలిచింది.

## రిజర్వేషన్లకు బీజేపీ వ్యతిరేకం : అఖిలేష్ యాదవ్

**లక్నో :** రిజర్వేషన్ల మూల సూత్రాలకు వ్యతిరేకంగా బీజేపీ వ్యవహరిస్తోందని ఎస్పీ చీఫ్, ఆ పార్టీ ఎంపీ అఖిలేష్ యాదవ్ ఆరోపించారు. వెనుకబడిన వర్గాలు, దళితులు, మైనారిటీ కుటుంబాల పట్ల వివక్ష ప్రదర్శిస్తున్నారని పేర్కొన్నారు. ఢిల్లీ, యూపీలోని విశ్వవిద్యాలయాల వైస్ ఛాన్సలర్ల నియామకాల్లో ఈ కుటుంబాల నుంచి ప్రాతినిధ్యం కరవైందని ఆందోళన వ్యక్తం చేశారు. ఢిల్లీ సెంట్రల్ యూనివర్సిటీ, జవహరల్ లాల్ నెహ్రూ యూనివర్సిటీ, బెనారస్ హిందూ యూనివర్సిటీల్లో బీసీలు, దళితులు, మైనారిటీలకు ప్రాతినిధ్యం లేదని, ఈ వర్సిటీల్లో కుటుంబాలకు చెందిన వారికి 15 శాతం కంటే తక్కువగా ఉద్యోగాలు కేటాయించారని దుయ్యబట్టారు. ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం రిజర్వేషన్లకు సానుకూలంగా లేదని స్పష్టం చేశారు. ఇక టీ20 ప్రపంచ కప్‌ను భారత్ హస్తగతం చేసుకోవడంపై వ్యాఖ్యానిస్తూ భారత్ విజయాన్ని దేశమంతా ఉత్సాహంగా ఆస్వాదించిందని పేర్కొన్నారు.

## ఇకపై ఆన్‌లైన్‌లో నీట్ పరీక్ష.. కేంద్ర ప్రభుత్వ యోచన..!

దిల్లీ : నీట్–యూజీ పరీక్షకు సంబంధించిన పేపర్ లీకేజీ వివాదం దేశవ్యాప్తంగా దుమారం రేపుతున్న వేళ కేంద్ర ప్రభుత్వం కొత్త ఆలోచన చేస్తున్నది. నీట్ పరీక్షను పెన్, పేపర్ పద్ధతిలో ఆఫ్‌లైన్‌లో కాకుండా ఆన్‌లైన్‌లో నిర్వహణకుగల సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తోంది. కేంద్రం ఆన్‌లైన్ నీట్ నిర్వహణ కోసం చేస్తున్న యోచన గురించి ఓ జాతీయ మీడియా సంస్థ వెల్లడించింది. ప్రస్తుతం నీట్ పరీక్ష పెన్, పేపర్ విధానంలో జరుగుతున్నది. ఈ విధానంలో అభ్యర్థులు ఓఎమ్మార్ షీట్‌లో తమ సమాధానాలను మార్క్ చేయాల్సి ఉంటుంది. అయితే నీట్‌లో అక్రమాలను అరికట్టేందుకు ఇకపై ఆన్‌లైన్ విధానమే సరైనదని కేంద్రం యోచిస్తోందని, దీనిపై చర్చించేందుకు కేంద్రం గత వారం కనీసం మూడు ఉన్నతస్థాయి సమావేశాలను ఏర్పాటు చేసిందని ఆ మీడియా కథనం పేర్కొంది.




## అధికార లాంఛనాలతో నిజామాబాద్‌లో డీఎస్ అంత్యక్రియలు..!

**నిజామాబాద్, జూన్ 30 (పీపుల్స్ మోటివేషన్) :** మాజీ మంత్రి, సీనియర్ కాంగ్రెస్ నేత డీ శ్రీనివాస్ అంత్యక్రియలు ఆదివారం నిజామాబాద్ బైపాస్ రోడ్డు సమీపంలోని ఆయన వ్యవసాయ క్షేత్రంలో జరిగాయి. ప్రభుత్వ అధికార లాంఛనాలతో డీఎస్ అంత్య క్రియలు నిర్వహించారు. అంతకు ముందు నిజామాబాద్ ప్రగతి నగర్ నుంచి మధ్యాహ్నం 12 గంటలకు డీఎస్ ఇంటి నుంచి ఆయన అంతిమయాత్ర ప్రారంభమైంది. డీఎస్ అంతిమయాత్ర.. కంఠేశ్వర్, బైపాస్ రోడ్డు మీదుగా డీ శ్రీనివాస్ ఫామ్ హౌజ్‌కు చేరుకుంది. ఈ అంతిమ యాత్రలో డీఎస్ కుటుంబ సభ్యులతోపాటు పలువురు రాజకీయ నేతలు, అభిమానులు పాల్గొన్నారు. శనివారం తెల్లవారుజామున హైదరాబాద్ లోని తన సొంతింట్లో డీఎస్ మరణించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం మేరకు నిజామాబాద్ లోని డీఎస్ సొంత వ్యవసాయ క్షేత్రంలో అధికార యంత్రాంగం ఆయన అంత్య క్రియలకు ఏర్పాట్లు చేసింది. అంతకుముందు డీఎస్ నివాసంలో డీ శ్రీనివాస్ పార్థివ దేహంపై సీఎం రేవంత్ రెడ్డి పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. అనంతరం డీఎస్ కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పీసీసీ అధ్యక్షుడిగా, రాష్ట్ర మంత్రిగా డీఎస్ సేవలందించారని గుర్తు చేశారు. నిజామాబాద్ జిల్లాలో బలహీన వర్గాలకు అవకాశాలు కల్పించిన నేత డీఎస్ అని పేర్కొన్నారు. ఆయన కుటుంబ సభ్యులను సంప్రదించి డీఎస్ జ్ఞాపకార్థం రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. విద్యార్థి నాయకుడు మొదలు అంచెలంచెలుగా ఎదిగి డీఎస్ ఉన్నత స్థాయికి చేరుకున్నారని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. కొంత కాలం పాటు పార్టీకి దూరమైనా పార్లమెంటులో డీఎస్‌ను సోనియా గాంధీ ఆప్యాయంగా పలకరించే వారని గుర్తు చేశారు. తాను చనిపోయినప్పుడు తనపై కాంగ్రెస్ జెండా కప్పాలన్న డీఎస్ చివరి కోరికను నెరవేర్చేందుకు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రి డీ శ్రీధర్ బాబును పంపి నెరవేర్చామన్నారు.



తెలుగు దినపత్రిక
పీపుల్స్ మోటివేషన్
People's Motivation

# కోవిడ్ సమయంలో.. వైద్యుల సేవలు అభినందనీయం






**అందుకే వారిని ప్రత్యక్ష దైవాలుగా అభివర్ణిస్తారు**

**ఐఎంఏ ఆధ్వర్యంలో జరిగిన డాక్టర్స్ డే వేడుకల్లో రాష్ట్ర మంత్రి టీజీ భరత్, ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి**

**కర్నూలు, జూన్ 30 (పీపుల్స్ మోటివేషన్):-**

కోవిడ్ సమయంలో వైద్యులు అందించిన సేవలు అభినందనీయమని, అందుకే వైద్యులను ప్రత్యక్ష దైవాలుగా అభివర్ణిస్తారని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఆహార శుద్ధి శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. కర్నూల్ నగరంలోని బి క్యాంప్ లో ఉన్న ఐఎంఏ భవన్లో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన డాక్టర్స్ డే వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైద్య పితామహుడు డాక్టర్ బి సి రాయ్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత వెంకటరెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ప్రవీణ్ కుమార్, సీనియర్ వైద్యులు డాక్టర్ బాల మద్దయ్య, డాక్టర్ శివశంకర్ రెడ్డి, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ రామచంద్ర నాయుడు, డాక్టర్ ఎస్వి రామ్మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో రాష్ట్ర మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ కరోనా సమయంలో కుటుంబ సభ్యులే ఒకరితో ఒకరు కలవలేని పరిస్థితుల్లో, వైద్యులు కరోనా ఉందని తెలిసిన పేషెంట్లకు అందించిన సేవలు అభినందనీయమని చెప్పారు. కర్నూల్ నగరంలో ఐఎంఏ భవనాన్ని నిర్మించడం, అందులో తమ టీజీవి గ్రూపు భాగస్వామ్యం ఉండడం ఆనందంగా ఉందని తెలియజేశారు .తాను ఎమ్మెల్యే కావడంలో అందరితోపాటు వైద్యుల ఆశీస్సులు కూడా ఉన్నాయని ఆయన వివరించారు .అందరి ఆశీస్సులతో రాష్ట్ర మంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్నానని తెలియజేశారు .నగరంలోని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలను తాను ఆకస్మికంగా తనిఖీ చేశానని, తన పర్యటనలో ప్రభుత్వ వైద్యశాలలో ఎన్నో సమస్యలు ఉన్నట్లు గుర్తించినట్లు తెలియజేశారు. వాటి అన్నింటిని ప్రణాళిక బద్ధంగా పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలియజేశారు. కర్నూలు నగరంలో ప్రైవేటు హాస్పిటల్స్ కు దీటుగా ప్రభుత్వ వైద్యశాలను తీర్చిదిద్దుతామని వివరించారు. గత ఐదు సంవత్సరాలుగా రాష్ట్రంలో పూర్తిగా అభివృద్ధి కుంటుబడిపోయిందని వివరించారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో పారిశ్రామిక రంగం, ఐటి రంగం రాష్ట్రానికి ముఖచిత్రం వంటివని, ఈ రెండు రంగాల్లో రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపించేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తుందని తెలియజేశారు .గతంలో చెప్పిన మేరకు కర్నూల్ లో హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు కృషి చేస్తామని వివరించారు. కర్నూలు జిల్లా అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చెప్పిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. వైద్య రంగంలో వస్తున్న ఆధునిక వైద్య చికిత్సలపై ఎప్పటికప్పుడు అధ్యయనం చేసి ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు రాష్ట్ర మంత్రి టీజీ భరత్ సూచించారు. అనంతరం పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత వెంకట రెడ్డి మాట్లాడుతూ.. సమాజంలో వైద్యుల పాత్ర మరువలేనిదని తెలియజేశారు. ఎంతో మంది పేదలకు వైద్య సేవలు అందిస్తున్న వైద్యులను ఆమె అభినందించారు. వైద్యులందరికీ డాక్టర్స్ డే శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ రామచంద్ర నాయుడు, డాక్టర్ ఎస్వి రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ కర్నూల్ నగరంలో ఐఎంఏ కార్యక్రమాలకు రాజ్యసభ మాజీ సభ్యులు టీజీ వెంకటేష్, ఆయన తనయుడు రాష్ట్ర మంత్రి టీజీ భరత్ అందిస్తున్న సహకారం మరువలేనిదని చెప్పారు. ముఖ్యంగా కర్నూల్ నగరంలో ఐఎంఏ భవన నిర్మాణానికి వారు అందించిన సహకారం మరువలేని తెలిపారు. అనంతరం డాక్టర్స్ డేను పురస్కరించుకొని సీనియర్ వైద్యులను రాష్ట్ర మంత్రి టీజీ భరత్, ఎమ్మెల్యే గౌరు చరిత వెంకటరెడ్డి చేతుల మీదుగా సన్మానించారు. అనంతరం కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న రాష్ట్ర మంత్రి టీజీ భరత్ తో పాటు ఎమ్మెల్యే గౌరు చరిత వెంకటరెడ్డిని సన్మానించారు.




## ఘనంగా వెంకయ్య నాయుడు 75 వసంతాల ఆత్మీయ కలయిక

**హైదరాబాద్, జూన్ 30 (పీపుల్స్ మోటివేషన్):-**

ఉదయగిరి నుంచి ఉపరాష్ట్రపతి వరకు.... పల్లెటూరు నుంచి పద్మ విభూషణ్ వరకు మహోన్నత ప్రస్థానాన్ని సాగించిన ముప్పవరపు వెంకయ్య నాయుడి 75 వసంతాల ఆత్మీయ కలయిక, పంచ సప్తతి కార్యక్రమం ఆదివారం హైదరాబాద్ గచ్చిబౌలి అన్వయ కన్వెన్షన్‌లో ఎంతో ఘనంగా జరిగింది. భారత ప్రధాని నరేంద్ర మోడీ ఢిల్లీ నుంచి లైవ్ లో నాయుడుని అభినందించారు. ఈ కార్యక్రమంలో మిజోరం రాష్ట్ర గవర్నర్ కంభంపాటి హరిబాబు,కేంద్ర మంత్రివర్యులు కిషన్ రెడ్డి, శాసన సభ్యులు కామినేని శ్రీనివాస్, భారత టొబాకో బోర్డు మాజీ చైర్మన్ యడ్లపాటి రఘునాధబాబు, సినీ నటులు బ్రహ్మానందం, సాయికుమార్, సంగీత దర్శకుడు కీరవాణి, విజ్ఞాన్ విద్యాసంస్థల అధినేత లావు రత్తయ్య, సీనియర్ జర్నలిస్టు నిమ్మరాజు చలపతిరావు తనయుడు శ్రీవత్సవ కుమార్ తో పాటు కుటుంబ సభ్యులు, మరెందరో ప్రముఖులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. తుమ్మల రంగారావు, విక్రాంత్ సభా కార్యక్రమాన్ని నిర్వహించారు.

## మహానేతను కోల్పోయాం



**వరంగల్, జూన్ 30 (పీపుల్స్ మోటివేషన్):-**

రమేష్ రాథోడ్ అకాల మృతి గిరిజనులకు భర్తీ చేయలేని లోటు రమేష్ రాథోడ్ చానా పేద కుటుంబం నుంచి అనేక ఆటుపోట్లను ఎదుర్కొని ఒక గిరిజన ముద్దుబిడ్డ అదిలాబాద్ జిల్లా పరిషత్ చైర్మన్ గా శాసనసభ్యులుగా అదిలాబాద్ పార్లమెంట్ సభ్యుడిగా ఎన్నికైన గొప్ప గిరిజన నేత అయిన అకాల మరణం గిరిజన జాతికి తీరని లోటు నేటి రోజు గిరిజన సంఘాలు ప్రజాసంఘాలు అనేక రాజకీయ పార్టీలు వరంగల్ ఉమ్మడి జిల్లా మొత్తంగా ఆయనకు ఘనమైన నివాళులర్పించడం జరుగుతా ఉంది లంబాడి ముద్దుబిడ్డ తెలంగాణ విషయమై పార్లమెంట్లో ఆర్గాళ్ళంగా గారే గర్జించిన లంబాడి నాయకుడు మరణించడం నిజంగా బాధాకరమైన విషయం ఆయనకు ఆత్మ శాంతి చేకూరాలని వారి కుటుంబానికి భగవంతుడు ధైర్యం చేకూర్చాలని ప్రార్థిస్తూ ఆయనకు నివాళులర్పిస్తున్నాము ఈ కార్యక్రమంలో మహబూబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్, మహబూబాద్ శాసనసభ్యులు డాక్టర్ మురళి నాయక్, డోర్నకల్ శాసనసభ్యులు డాక్టర్ రామచంద్రనాయక్ ,పోరిక ఈశ్వర్ సింగ్ లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు లంబాడి ఐక్యవేదిక హనుమకొండ డిస్టిక్ కోఆర్డినేటర్ లావిడియరాజు నాయక్ పోరిక వీరన్న నాయక్, సజన్ నాయక్ శ్యామల నాయక్ రామచంద్రనాయక్ ఉదయ్ సింగ్ నాయక్ జడ్పిటిసి వీరమ్మ పోరిక హరిపిత నాయక్ వెంకట్ లంబాడీ ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ భూక్య మోహన్ నాయక్ గుండ్ల సింగారం యువనేత అజ్మీర వెంకటేష్ వీధితోపాటు అనేకమంది పాల్గొని వారికి నివాళులర్పించారు.

## ఉమ్మడి జిల్లాలో చురుకుగా కాంగ్రెస్

**నిజామాబాద్,జూన్30(పీపుల్స్ మోటివేషన్):**

ఉమ్మడి జిల్లాలో కాంగ్రెస్ బలోపేతానికి నేతలకు అవకాశం దొరికింది. ఇప్పటికే అంతా మళ్లీ పాతగూటికి చేరుతున్నారు. రానున్న స్థానిక ఎన్నికల్లో సత్తా చాటేలా అడుగుల వేస్తున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో గత ఆరనెలలుగా ఉమ్మడి జిల్లాలో కాంగ్రెస్ కార్యకలాపాలు పెరిగాయి. ఇప్పుడు కార్యకర్తలు కూడా ధైర్యంగా కార్యక్రమాలను ముందుకు తీసుకుని వెళుతున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రావడం, షబ్బీర్ అలీ ప్రభుత్వ సలహాదారు కావడంతో అనేక కార్యక్రమాలకు అవకాశం ఏర్పడింది. జిల్లాకు చెందిన కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీమంత్రి షబ్బీర్ అలీ ఇప్పటికే పలు కార్యక్రమాలతో ముందుకు సాగుతున్నారు. జిల్లాలో పార్టీ విస్తరణకు గల అవకాశాలను అందిపుచ్చు కుంటున్నారు. ప్రధానంగా జిల్లాలో పసుపు, ధాన్యం, ఎర్రజొన్న రైతుల సమస్యలపై పోరాడడం ద్వారా రైతుల్లో కొంత సానుభూతిని సాధించారు. ఈ విషయాల్లో బిఆర్ఎస్, బిజెపిలు విఫలం అయ్యాయని షబ్బీర్ అలీ అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో రైతు సంక్షేమానికి పెద్దపీట వేసామని అన్నారు. త్వరలోనే రుణమాఫీతో వారిలో మరింత భరోసా పెరగనుంది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో రైతులకు ఒకే దఫాలో రూ.2లక్షల రుణమాఫీ చేస్తామన్న హామీకి అడుగు పడుతోంది. ఉపాధిహామీ పథకాన్ని వ్యవసాయ అనుసంధానం, పంట బీమా, వరికి క్వింటాల్‌కు రూ.2500 చెల్లిస్తామన్నారు. రేవంత్ రెడ్డి కూడా ఇప్పటికే పసుపు రైతుల పోరాటానికి మద్దతుగా నిలిచి ఇక్కడి కాంగ్రెస్ శ్రేణుల్లో నూతనోత్సాహం నింపారు. ఎన్నికల ఫలితాలు కూడా అనుకూలంగా రావడంతో ఇంతకాలం స్తబ్దుగా ఉన్న కాంగ్రెస్ కార్యకర్తలకు నయాజోష్ వచ్చిందని షబ్బీర్ అలీ అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గతంలో ఆర్మూర్ లో కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాజీవ్ రైతు భరోసా దీక్ష విజయవంతమైంది. ఆశావహులు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారు. దీనికితోడు మాజీ ఎంపీ మధుయా ష్కీ గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్ గౌడ్ ల వల్ల అదనపు బలంగా మారింది. జిల్లా రాజకీయాల్లో వీరు కూడా తమవంతుగా ఉత్సాహం నింపుతున్నారు. మధుయాష్కీ నిజామాబాద్ పార్లమెంట్ నుంచి రెండు పర్యాయాలు ప్రాతినిధ్యం వహించారు. ఆయనకు అధినాయకులతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. అలాగే, వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్‌గౌడ్‌తో నాయకులకు, కార్యకర్తలకు చనువు వుంది. ఎన్ఎస్‌యూఐ నాయకుడిగా ఉన్నప్పటి నుంచి అందరితో సంబంధాలు ఉన్నాయి. మొత్తంగా పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని భావిస్తున్నారు. ఈ క్రమంలో పార్టీలో క్రియాశీలకంగా ఉండాలని చాలామంది ముందుకు వస్తున్నారని అన్నారు. గత మున్సిపల్, స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ ప్రభావం ఏ మాత్రం కనిపించలేదు.

# రైల్వే ఆధునీకరణ పనులు ఎవరి కోసం





**నంద్యాల, జూన్ 30 (పీపుల్స్ మోటివేషన్):-**

నంద్యాల రైల్వే స్టేషన్ ఆధునీకరణ పనులు అధికారులు ఎవరి కోసం చేస్తున్నారనే ప్రశ్న తేలేత్తుతోంది, నంద్యాల రైల్వే స్టేషన్ అభివృద్ధికి కేంద్రప్రభుత్వం సుమారు రూ. 20 కోట్లు మంజూరు చేసి వివిధ పనులు చేస్తున్నారు. ఆధునీకరణ పనుల్లో భాగంగా నంద్యాల రైల్వే స్టేషన్ కు పట్టణం నుంచి వచ్చే ప్రధాన ధ్వారం ముందు నూనెపల్లె - మూలసాగరం వైపు వెళ్లే 40 అడుగుల ప్రధాన రహదారికి ప్రత్యామ్నయంగా తూర్పు వైపు ఎవి అపార్ట్మెంట్ రోడ్డు నుంచి పరమట మూలసాగరం రోడ్డు వరకు సుమారు కిలోమీటర్ 30 అడుగుల కొత్త రోడ్డు నిర్మాణం పనులు మొదలు పెట్టారు. పట్టణ జనాభా, వాహనాల సంఖ్య పెరుగుదల, భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని పాత 40 అడుగుల రోడ్డే సరిపోవడం లేదు, ఈ రోడ్డును 80 అడుగులకు పెంచి రైల్వే ప్రయాణికుల కష్టాలు తొలగించాలని పట్టణ ప్రజలు కోరుతుంటే అది పట్టించుకోని రైల్వే శాఖ అధికారులు పాత రోడ్డుకు పట్టణం వైపు కొద్ది దూరంలో కొత్త రోడ్డు నిర్మాణం మాత్రం 30 అడుగుల వెడల్పుతో వేయడం ఏంటని రైల్వే అధికారులను పట్టణ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. నంద్యాల పట్టణం నుంచి వచ్చే ఉత్తర ప్రధాన ద్వారం ప్రాధాన్యతను తగ్గించి దక్షిణ వైప్ రైల్వే ధ్వారం అభివృద్ధి చేసుకొని తన ఆసుపత్రులు, హోటల్ వ్యాపారం అభివృద్ధి చేసుకునేందుకు మాజీ ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి ప్రయత్నం చేశారనే ఆరోపణలు ఉన్నాయి. అందులో భాగమే 40 అడుగుల రోడ్డు కాకుండా 30 అడుగులకు తగ్గించి కొత్త రోడ్డు నిర్మాణం చేస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. వెంటనే రైల్వే స్టేషన్ ముందు కొత్తగా వేస్తున్న 30 అడుగుల రోడ్డు పనులను నిలుపుదల చేసి పట్టణ రైల్వే ప్రయాణికుల భవిష్యత్ అవసరాల దృష్ట్యా స్టేషన్ ముందు ప్రధాన ఆర్చి, 100 అడుగుల సర్కిల్, 60 అడుగుల కొత్త రోడ్డు పనులు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. వివిధ ప్రాంతాల నుంచి నంద్యాల రైల్వే స్టేషన్ కు వ్యాగన్ల ద్వారా పిడిఫ్ బియ్యం వచ్చి స్టేషన్ నుంచి స్టేషన్ కు ఎదురుగా ఉన్న కేంద్రగిడ్డంగుల గోదాములకు లారీలలో తరలించేందుకు ఈ కొత్తగా వేస్తున్న 30 అడుగుల రోడ్డే ప్రధానం అంటున్న రైల్వే అధికారులు, ప్రస్తుతం రైల్వే స్టేషన్ ప్రధాన ఆర్చి ముందు ఉన్న నూనెపల్లె - మూలసాగరం రోడ్డుకు బదులు ఆటోలు, రైల్వే ప్రయాణికులు, భారీ వాహనాలకు కూడా భవిష్యత్ లో ఈ 30 అడుగుల రోడ్డే అంటున్న రైల్వే అధికారులు.

తెలుగు దినపత్రిక
# పీపుల్స్ మోటివేషన్
People's Motivation

సోమవారం । జులై । 01 । 2024



# శ్రీ వెంకయ్యనాయుడి గారి నుంచి చాలా నేర్చుకున్నా : ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ

**యువత రాజకీయాల్లోకి రావాలి, సిద్ధాంతపరమైన రాజకీయాలను ప్రోత్సహించాలి**
**శ్రీ ముప్పవరపు వెంకయ్యనాయుడు**
**వ్యక్తిత్వం, దార్శనికతల మేలు కలయికే వెంకయ్య**
**దేశ ప్రయోజనాలే మిన్న అని నమ్మిన వ్యక్తి**
**ఆయన జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకమన్న ప్రధాని**
**భారత పూర్వ ఉపరాష్ట్రపతి 75వ పుట్టినరోజు సందర్భంగా, వారి జీవిత విశేషాలతో మూడు పుస్తకాల ఆవిష్కరణ**



హైదరాబాద్, జూన్ 30 (పీపుల్స్ మోటివేషన్):-

భారత పూర్వ ఉపరాష్ట్రపతి శ్రీ ముప్పవరపు వెంకయ్యనాయుడు గారి నుంచి తాను చాలా నేర్చుకున్నానని భారత ప్రధాన మంత్రి శ్రీ నరేంద్రమోదీ చెప్పారు. మంచి ఆలోచనలు, మంచి వ్యక్తిత్వం, దార్శనికతల మేలు కలయికే శ్రీ వెంకయ్య నాయుడిగారి జీవితమన్నారు. శ్రీ వెంకయ్యనాయుడు గారి 75వ పుట్టినరోజును పురస్కరించుకుని హైదరాబాద్ గచ్చిబౌలిలో ఉన్న అన్వయ కన్వెన్షన్ లో "పంచ సప్తతి" పేరిట వారి మిత్రులు ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమం లో వీడియో కాన్ఫరెన్స్ వేదిక ద్వారా ప్రధానమంత్రి ... వెంకయ్య నాయుడి గారి జీవన ప్రస్థానం ఆధారంగా రూపు దిద్దుకున్న 1. వెంకయ్య నాయుడు (ఐ లైఫ్ ఇన్ సర్వీస్) %-% జీవన ప్రస్థానం %-% ఆంగ్లం, 2. సెలబ్రేటింగ్ భారత్ (13వ ఉపరాష్ట్రపతిగా 5 ఏళ్ళ ప్రయాణం) %-% ఆంగ్లం, 3. మహానేత (జీవన చిత్రమాలిక) %-% తెలుగు పుస్తకాలను ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ మాట్లాడుతూ శ్రీ వెంకయ్యనాయుడిగారితో తన సుదీర్ఘ అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఆయనతో కలిసి సుదీర్ఘకాలం పాటు పని చేసే అవకాశం దక్కిందన్నారు. ఆయన భారతీయ జనతాపార్టీ జాతీయ అధ్యక్షుడిగా పని చేసిన కాలంలో, తన మంత్రివర్గంలో సీనియర్ మంత్రిగా పని చేసినప్పుడు, ఉపరాష్ట్రపతిగా, రాజ్యసభ ఛైర్మన్ గా బాధ్యతలు నిర్వర్తించినప్పుడు ఆయనతో కలిసి పనిచేసే అవకాశం దక్కిందన్నారు. "ఒక చిన్నగ్రామం నుంచి ప్రస్థానం మొదలు పెట్టి, పెద్ద పెద్ద పదవులు చేపట్టిన శ్రీ వెంకయ్యనాయుడిగారి అనుభవ సంపద అమూల్యం. ఆయన నుంచి నేను చాలా నేర్చుకున్నాను. మంచి ఆలోచనలు, మంచి వ్యక్తిత్వం, దార్శనికతల మేలు కలయికే శ్రీ వెంకయ్య నాయుడిగారి జీవితం." అని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో కొన్ని దశాబ్దాల క్రితం భారతీయజనతాపార్టీ, జనసంఘ్ కు పెద్దగా పునాది లేదన్న సంగతిని మోదీ గుర్తు చేస్తూ అటువంటి రోజుల్లోనే శ్రీ వెంకయ్యనాయుడు దేశ ప్రయోజనాలే అన్నింటికన్నా ముందు అని విశ్వసించి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో ఏబీవీపీ కార్యకర్తగా ఎంతో కష్టపడి, తదనంతరం పార్టీని నమ్ముకుని పని చేశారని కొనియాడారు. అత్యయిక స్థితి కి వ్యతిరేకంగా శ్రీ వెంకయ్యనాయుడు పోరాడారని గుర్తు చేసిన శ్రీ నరేంద్ర మోదీ, 17 నెలల పాటు జైల్లో నిర్బంధించినా ఆయన వెనకంజ వేయకుండా ధైర్యంగా పోరాడారని కొనియాడారు. శ్రీ వెంకయ్యనాయుడు రాజకీయాలను, అధికారాన్ని సేవా మార్గంగా భావించారన్న ఆయన, శ్రీ వాజ్పేయి గారి ప్రభుత్వంలో శ్రీ వెంకయ్యనాయుడిగారికి మంత్రిగా అవకాశం వచ్చినప్పుడు ఆయన ఏరికోరి గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి బాధ్యతలు చేపట్టారని చెప్పారు. "వెంకయ్యనాయుడు గారు గ్రామాలకు, పేదలకు, రైతులకు సేవ చేయాలనుకున్నారు." అని పేర్కొన్నారు. ఆ తర్వాత తన హయాంలో పట్టణాభివృద్ధి శాఖ మంత్రిగా స్వచ్ఛభారత్ మిషన్, స్మార్ట్ నగరాల వంటి కార్యక్రమాలను ఎంతో చక్కగా ముందుకు తీసుకెళ్లారన్నారు. శ్రీ ముప్పవరపు వెంకయ్యనాయుడు గారి సౌమ్యత, చమత్కారంతో కూడిన వాక్చాతుర్యాన్ని ప్రశంసించిన ప్రధానమంత్రి వారి తెలివితేటలు, సహజత్వం, త్వరితగతిన ప్రతిస్పందించటం, వన్ లైనర్లకు ఎవరూ సాటి లేరని గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా శ్రీ అటల్ జీ నాయకత్వంలో సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడిన సమయంలో "ఒక చేతిలో బీజేపీ జెండా %-% మరో చేతిలో ఎన్డీయే అజెండా" అంటూ వారు ఇచ్చిన నినాదాన్ని గుర్తు చేశారు. అదేవిధంగా 2014లో మోదీ (%మీణ×%) అనే అక్షరాలకు మేకింగ్ ఆఫ్ డెవలప్డ్ ఇండియా అనే సంక్షిప్త పదాన్ని ఇచ్చిన సందర్భాన్ని గుర్తు చేసుకున్నారు. వారి మాటల్లోని లోతు, గాంభీర్యం, దార్శనికత, వివేకం వంటివి తనకు అనేక సందర్భాల్లో ఆశ్చర్యపరిచాయని గుర్తు చేశారు. శ్రీ వెంకయ్య నాయుడు గారు రాజ్యసభ ఛైర్మన్ గా ఉన్నప్పుడు సభలో ఉన్న సానుకూల వాతావరణాన్ని గుర్తు చేసిన ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఆ సమయంలో సభలో జరిగిన సానుకూల చర్చల గురించి ప్రస్తావించారు. ఆర్టికల్ 370 బిల్లును ముందుగా రాజ్యసభలో ప్రవేశపెట్టిన విషయాన్ని గుర్తు చేస్తూ, సభా ఔన్నత్యం, మర్యాదలను కొనసాగిస్తూనే ఇలాంటి ముఖ్యమైన బిల్లు ఆమోదం పొందటంలో వారి అనుభవజ్ఞత ఎంతగానో ఉపయోగపడిందని ప్రశంసిచారు. శ్రీ వెంకయ్యనాయుడు గారు పరిపూర్ణమైన జీవితాన్ని, సంపూర్ణ ఆరోగ్యంతో గడపాలని ప్రధాని ఆకాంక్షించారు. భావోద్వేగాలు, ప్రతికూలతలు వంటి అంశాలు శ్రీ వెంకయ్యనాయుడు గారి నిర్ణయాధికారాన్ని ప్రభావితం చేయలేకపోయాయన్న ప్రధానమంత్రి, సంక్రాంతి వంటి తెలుగు పండుగల సందర్భంలో ఢిల్లీలో వెంకయ్య గారి నివాసంలో జరిగిన సంబరాల్లో పాల్గొన్న విషయాన్ని గుర్తు చేసుకున్నారు.

భారతదేశ రాజకీయాల్లో శ్రీ వెంకయ్య నాయుడు గారి సేవలను ప్రశంసించిన ఆయన, ఈరోజు ఆవిష్కరించిన మూడు పుస్తకాలు యువతకు స్ఫూర్తిదాయకమైనవి అని పేర్కొన్నారు. 2047లో అభివృద్ధి చెందిన భారతదేశం స్వాతంత్ర శతాబ్ధి ఉత్సవాలను జరుపుకోనుందని, అదే సమయంలో శ్రీ వెంకయ్యనాయుడు గారు కూడా తమ జీవన శతాబ్ధి మైలురాయిని జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి సందేశానికి ధన్యవాదాలు చెప్పిన పూర్వ ఉపరాష్ట్రపతి శ్రీ ముప్పవరపు వెంకయ్య నాయుడు, శ్రీ నరేంద్రమోదీ గారి దిశానిర్దేశకత్వంలో దేశం ప్రగతిబాటన పయనిస్తోందని, మంచి పథకాలతో రైతులు, పేదలు, మహిళలు, యువత సహా అన్ని రంగాలకు చెందిన ప్రజల ఉన్నతికి బాటలు వేస్తున్న వారి చొరవను ప్రశంసించారు. ఇది భవిష్యత్ లో మరింత వేగంగా, క్షేత్ర స్థాయికి చేరుకోవాలని, పేదరిక నిర్మూలనకు మరింత కృషి జరగాలని ఆకాంక్షను వ్యక్తం చేసిన ఆయన, ఉచితాలను ప్రజలకు అలవాటు చేయవద్దని సూచించారు. అర్హులకు సంక్షేమ పథకాలు కొనసాగిస్తూనే నైపుణ్యాభివృద్ధి జరగాలని చెప్పారు. ప్రాథమిక స్థాయి మొదలుకుని సాంకేతిక విద్య వరకూ మాతృభాషలో బోధన ఉండాలన్న ఆయన, విద్యావ్యవస్థలో ఈ దిశగా త్వరితగతిన సానుకూల మార్పులను వేగవంతం చేయవలసిన అవసరం ఉందని ప్రధానికి తెలిపారు. పంచసప్తతి కార్యక్రమానికి విచ్చేసిన ఆత్మీయులందరికీ ధన్యవాదాలు తెలిపిన శ్రీ ముప్పవరపు వెంకయ్యనాయుడు, రాజకీయాల్లోకి యువత రావాలని ఆకాంక్షించారు. అయితే సిద్ధాంతపరమైన రాజకీయాలకు ప్రాధాన్యత పెరగాల్సిన అవసరం ఉందని సూచించారు. ఈ నేపథ్యంలో రాజకీయ పార్టీలు సైతం విలువలతో కూడిన రాజకీయాలకు ప్రాధాన్యత పెంచాలని, పార్టీ అభ్యర్థులకు ప్రవర్తనా నియమావళి రూపొందించాలని సూచించారు. అభ్యర్థుల గుణగణాలకు, సిద్ధాంతపర రాజకీయాలకు పెద్ద పీట వేయాలని సూచించారు. కులం, ధనం ప్రభావం పెరగడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదని స్పష్టం చేశారు. సభ ఔన్నత్యాన్ని పెంచే విధంగా సభ్యులు ప్రవర్తించాలని ఆయన సూచించారు.

## ఓటు బ్యాంక్ లక్ష్యంగా
# నగదు బదిలీలు

(మొదటి పేజీ తరువాయి)

పోటీపడి అప్పులు చేసి రాష్ట్రాలను గుల్ల చేశారు. విభజన తరవాత ఇలాంటి నేతల కారణంగా రెండు రాష్ట్రాలు పూర్తిగా కుదలేయ్యాయి. ఆంధ్రప్రదేశ్ రాజకీయాలను గమనించిన వారు. పాలనలో పెద్దగా మార్పు కనిపించకున్నా పథకాల పేరుతో పందేరం సాగించారని విమర్శలు చేశారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దారుణంగా ఉన్నప్పటికీ, పథకాల అమలు విషయంలో వెనకడుగు వేయకపోవడం జగన్మోహన్‌రెడ్డి అనుభవ రాహిత్యానికి, స్వార్థానికి పరాకాష్టగా చూడాలి. పటిష్టమైన ఓటు బ్యాంక్‌ను నిర్మించుకోవడమే ఈ పథకాల అమలు వ్యూహమని రాజకీయ విశ్లేషకులు సైతం అప్పుడే హెచ్చరించారు. కానీ చేతులు కాలాక ఆకులు పట్టుకున్న చందంగా ఇప్పుడు ఎపిలో పరిస్థి ఏర్పడిందని ప్రజలు కూడా అంగీకరిస్తున్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దారుణంగా ఉన్నప్పటికీ సమర్థుడైన చంద్రబాబు దీనిని గట్టెక్కించే పనిలో పడ్డారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అనుమతించక పోయినా ప్రజాధనాన్ని పంచిపెట్టే కార్యక్రమాన్ని కొనసాగించాలన్న ఆలోచనలకు దూరంగా ఉండాలి. దివంగత వైఎస్ కూడా ఇలాగే ప్రజల్లో మంచి పేరు సంపాదించారు. అదే ఆయనను ఉమ్మడి ఎపిలో రెండోసారి అధికారంలోకి తీసుకుని వచ్చింది. అయితే అదేపనిగా ఆయన ఎప్పుడూ డబ్బుల పందేరం చేయలేదు. ప్రజల సంక్షేమంతో పాటు అభివృద్ధిని కూడా ముందుకు తీసుకుని వెళ్లారు. పథకాల అమలుతోపాటు సోషల్ ఇంజనీరింగ్ ద్వారా బలమైన ఓటు బ్యాంకును నిర్మించు కోవడానికి జగన్ వేసిన ఎత్తుగడలు ఎలా ఉన్నా ఎపిని కలోలుకోలేని దెబ్బతీసింది. ఉపాధి, ఉద్యోగ రంగాలు దెబ్బతిన్నాయి. పారిశ్రామిక రంగం కుదేలయ్యింది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అనుమతించ కపోయినా ప్రజాధనాన్ని పంచిపెట్టే కార్యక్రమాన్ని కొనసాగించారు. తద్వారా ప్రజలలో మంచి పేరు తెచ్చుకోవాలనీ జగన్ భావించారు. కానీ ప్రజలు అసలు విషయం గుర్తించి పాతరేశారు. మరోవైపు కెసిఆర్ మాయలోపడి తెలంగాణలో అమలు చేస్తున్న పథకాలు కాపీ కొడుతూ వచ్చారు. వాస్తవ పరిస్థితిని ముఖ్యమంత్రి జగన్ పట్టించుకోవడం లేదనీ సర్వత్రా విమర్శలు వచ్చినా పెడచెవిన పెట్టారు. జీతాలు చెల్లించడానికి కూడా నిధులు లేకుండా చేసుకున్నారు. వీటన్నింటిని పరిశీలించి పరిష్కరించే బృహత్తర బాధ్యత ఇప్పుడు చంద్రబాబుపై పడింది. ఓ వైపు సంఓఏమం కొనసాగిస్తూనే అభివృద్ధిని పరుగులు పెట్టించాలి. పోలవరం, రాజధాని అమరావతిలను పట్టాలకెక్కించాలి. పారిశ్రామిక పురోగతి సాధించాలి.

# పార్లమెంట్ స్తంభన కాదు..చర్చ సాగాలి !

పార్లమెంటులో ప్రజల సమస్యలపై చర్చ సాగాల్సిందే. చర్చకు విపక్షాలు పట్టుబట్టాల్సిందే. చర్చలకు ప్రభుత్వం సహేతుకంగా సమాధానం ఇవ్వాల్సిందే. ఇటీవల నీట్ పరీక్షలపై దుమారం చెలరేగింది. పేపర్ లీకేజీ వ్యవహారం చూస్తుంటే ఇదంతా కొందరు ఆడిన డ్రామాగా కనిపిస్తోంది. లక్షలాదిమంది విద్యార్థులను మోసం చేసి..కొందరు తమ స్వార్థం కోసం పేపర్ లీక్ చేశారని అర్థం అయ్యింది. దీనిపై చర్చించాలని లోక్‌సభలో విపక్షనేత రాహుల్ గాంధీ పట్టుబట్టారు. ఆయన పట్టుబట్టడం..వాయిదా తీర్మానాన్ని స్పీకర్ తిరస్కరించడం జరిగింది. పార్లమెంట్ వాయిదా పడడంతో ఒకరోజు పార్లమెంట్ వృధా అయ్యింది. ప్రధాన ప్రతిపక్షం సమస్యలను ప్రస్తావించే క్రమంలో రూల్ పొజిషన్ కూడా స్టడీ చేయాలి. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానం ఆమోదించడం అవసరం. దీనిపై చర్చ జరుగుతుంది. ఈ చర్చలో నీట్‌పైనా చర్చించే అవకాశం ఉంటుంది. విపక్షం ఈ సందర్భంగా నీట్ అంశాన్ని ఉపయోగించుకుని ఉండాల్సింది. కానీ చర్చకు పట్టుబట్టడంతో పార్లమెంట్ ఉభయసభలు వాయిదా పడ్డాయి. పార్లమెంట్ స్తంభించిందన్న వార్తలు వచ్చాయి. దీంతో ఈ సమస్య ఆ ఒక్కరోజుతోనే ముగిసింది. కానీ చర్చ సాగివుంటే నిజాలు బయటకు వచ్చేవి. నిజానికి అనేక అంశాలు గత పదేళ్లుగా నానుతున్నాయి. వీటన్నింటిని చర్చించే సత్తా కలిగిన విపక్షం ఇప్పుడు లోక్‌సభలో ఉంది. పార్లమెంట్ సమావేశాలు నిముషం కూడా వృధా కాకుండా చూస్తూనే.. చర్చకు తెరలేపాలి. పార్లమెంట్‌ను స్తంభింప చేయడం, వాకౌట్లు చేయడం పాతపద్దతి. రూల్ పొజిషన్ మేరకు నోటీసులు ఇచ్చి చర్చ చేసేలా ప్రభుత్వంపై ఒత్తిడి తేవడంలో విపక్షం వ్యూహాత్మకంగా అడుగులు వేయాలి. అప్పుడే సమస్యల వ్యవహారం ప్రజల ముందుకు వస్తుంది. పార్లమెంటులో పాలకుల దుర్నీతిని ఎండగట్టేందుకు వ్యూహం కూడా కావాలి. అధికారపక్షం పార్లమెంట్ వాయిదానే కోరుకుంటుంది. ఇది గమనించాల్సి ఉంది. నీట్ పరీక్షల్లో అవకతవకలపై పార్లమెంటు ఉభయసభలు శుక్రవారం దద్దరిల్లాయి. నీట్‌పై సమగ్ర చర్చను చేపట్టాలన్న తమ డిమాండ్‌కు అధికారపక్షం అంగీకరించకపోవటంతో ప్రతిపక్ష ఎంపీలు నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై తొలుత చర్చిద్దామని, ఆ సందర్భంగా నీట్‌పైనా చర్చ జరపవచ్చన్న ప్రభుత్వ సూచనకు విపక్షాలు అంగీకరించలేదు. దీంతో ఉభయసభల్లో ప్రతిష్టంభన నెలకొంది. ఫలితంగా పలుమార్లు వాయిదా పడ్డాయి. ఉదయం లోక్‌సభ సమావేశం కాగానే.. నీట్‌తోపాటు ఇతర పరీక్షల ప్రశ్నాపత్రాలు లీకైన ఘటనలపై చర్చను కోరుతూ కాంగ్రెస్ ఎంపీ కేసీ వేణుగోపాల్ వాయిదా తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఇతర కార్యకలాపాలను రద్దు చేసి పేపర్ లీకేజీలపై చర్చను చేపడదామని విపక్ష ఎంపీలు డిమాండ్ చేశారు. దీనిపై స్పీకర్ ఓం బిర్లా స్పందిస్తూ.. ఇటీవల దివంగతులైన 13 మంది మాజీ ఎంపీలకు తొలుత నివాళి అర్పిద్దామన్నారు. నివాళి ముగియగానే విపక్ష ఎంపీలు మళ్లీ తమ డిమాండ్‌ను కొనసాగించారు. నీట్ చాలా ముఖ్యమైన అంశమని, దానిపై చర్చ అవసరమని ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ పేర్కొన్నారు. అయితే, రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ జరపాలని ఇప్పటికే నిర్ణయించామని, ఆ చర్చలోనే అన్ని అంశాలనూ లేవనెత్తవచ్చని, తగిన సమయం ఇస్తానని స్పీకర్ చెప్పారు. దీనిని అవకాశంగా తీసుకుని నీట్‌పై చర్చ చేసివుంటే లక్ష్యం నెరవేరేది. కానీ ఈ అవకాశాన్ని విపక్షం వృధా చేసుకుంది. సభలో ప్రతిష్టంభన నేపథ్యంలో స్పీకర్ సభను సోమవారానికి వాయిదా వేశారు. రాజ్యసభలోనూ ఇటువంటి గందరగోళమే నెలకొంది. రాష్ట్రపతి ప్రసంగంపై చర్చను పక్కనపెట్టి, ముందుగా నీట్‌పై చర్చిద్దామని విపక్షాలు డిమాండ్ చేశాయి. ఇలా చేయడం విపక్షానికి తగిన పనికాదు. విపక్షం తమ పంతం నెరవేరిందని, సభ వాయిదా పడిందని అనుకుంటే పప్పులో కాలేసినట్లే. గతంలో లాగా ప్రతిష్ఠంభన కార్యక్రమాలతో ప్రజల సమస్యలకు పరిష్కారం దొరకదు. చర్చలు జరిపి ప్రభుత్వం దిగివచ్చేలా చేయాలి. నిజానికి దేశం ఇప్పుడు అనేకానేక సమస్యలు ఎదుర్కొంటోంది. గత పదేళ్లుగా మసిపూసి మారేడుగాయ చేశారు. రూపాయి విలువ రోజురోజుకూ పతనం అవుతోంది. దేశంలో ఆర్థిక దుస్థితిని పరిశీలించి అడ్డుకట్ట వేసే చర్యలు కానరావడం లేదు. ధరలు మోత మోగిస్తున్నాయి. సగటు కుటుంబానికి నెలకు 50వేలు లేనిదే పూట గడవలేని దుస్థితి నెలకొంది. జిఎస్టీలు తగ్గించడం, ఇన్‌కమ్ టాక్స్ పరిమితి పెంచడం, ఉపాధి రంగాలను బలోపేతం చేయడం వంటి అత్యవసర చర్యలపై కేంద్ర,రాష్ట్రాలు దృష్టి సారించడం లేదు. ఆర్థికంగా దేశాన్ని బలోపేతం చేసే చర్యలపై మోడీ ప్రభుత్వం పెద్దగా పట్టించుకోవడంలేదు. కార్పోరేట్లకు అండగా నిలవడం తప్ప ప్రజలకు అండగా ఉండే చర్యలు కానరావడం లేదు. ప్రజలను కష్టాల కొలిమిలోంచి బయటపడేసే చర్యలు కానరా వడం లేదు. పేదలు మరింత పేదలుగా మారారు. అలాగే మధ్య తరగతి ప్రజలు మరింతగా దెబ్బతిన్నారు. కాయకష్టం చేసుకునే వారికి ఢోకా లేకున్నా ఉపాధి, ఉద్యోగ రంగాలు మాత్రం వెక్కిరిస్తున్నాయి. దెబ్బతిన్న రంగాలను గుర్తించి వారిని ఆదుకోవడంలో ప్రభుత్వాలు విఫలం అవుతున్నాయి. ప్రధానంగా లోయర్ మిడిల్ క్లాస్ వాళ్లు బాగా దెబ్బతిన్నారు. ఉద్యోగాలు పోయాయి. ఉపాధి దొరకడం లేదు. ఈ వర్గాలను గుర్తించి వారిని నేరుగా ఆదుకునే చర్యలకు ఉపక్రమించాలి. గతంలో ప్రకటించిన ఆత్మనిర్భర భారత్ ఎవరికి మేలు చేసిందో తెలియదు. సర్వే జరిపించి ఉపాధి, ఉద్యోగాలు కోల్పోయిన వారిని గుర్తించి వారికి చేయూతను అందించాలి. అలాగే బ్యాంకులు ఉదారంగా తక్కు వడ్డీలకు రుణాలు ఇచ్చేలా చూడాలి. చిన్నా చితకా వ్యాపారాలు చేసుకునే వారికి ఎలాంటి షరతులు లేకుండా రుణాలు ఇవ్వగలగాలి. అప్పుడే గ్రామీణ ఆర్థికరంగం బలోపేతం అవుతుంది. అసత్యాలు, అర్థసత్యాలతో ఎప్పటికప్పుడు నెట్టుకురావడం కాక, ప్రజల మనసుల్లో రక్షకులుగా చిరస్థాయి గా నిలిచి పోయేందుకు పాలకులు కృషి చేయాలి. అలాగే ఆర్థికంగా అతిపెద్ద చర్యలకు ఉపక్రమించాలి. ప్రధానంగా ఉపాధిరంగాలను విపరీతంగా ప్రోత్సహించాలి. ప్రజలకు అవసరమైతే వడ్డీలేని రుణాలు ఇవ్వాలి. చిన్నాచితకా వ్యాపారాలు, ఉపాధి అవకాశాలకు ప్రోత్సాహకాలు ఇవ్వనతవరకు దేశ అర్థికస్థితి కుదుట పడదని గుర్తించాలి. ఇవన్నీ కూడా చర్చించడానికి వేదిక లేదు. మోడీ ఏకీకృత సామ్రాజ్యం నిర్మించు కోవడంతో ఆ కోటలోకి ప్రవేశించే ఆస్కారం లేకుండా పోయింది. అందువల్ల ఈ సమస్యలను కేవలం పార్లమెంటులోనే చర్చించేలా విపక్షం పక్కాగా వ్యూహం పన్నాలి. అప్పుడే పార్లమెంటులో ప్రజల సమస్యలు చర్చకు వస్తాయి. అందుకు అనుగుణంగా విపక్షం నడుచుకోవాలి. పార్లమెంట్ స్తంభన అన్న పాతపద్దతులకు దూరంగా ఉంటేనే మేలు.

తెలుగు దినపత్రిక
పీపుల్స్ మోటివేషన్
People's Motivation



## కల్కి పార్ట్-2 కోసం వేచిచూస్తున్నా: తలైవా

### అద్భుతంగా ఉందటంటూ నాగార్జున కితాబు

నాగ్ అశ్విన్ దర్శకత్వంలో ప్రభాస్ హీరోగా తెరకెక్కిన 'కల్కి 2898 ఏడీ' తాజాగా ప్రేక్షకుల ముందుకువచ్చి మంచి టాక్‌ను సొంతం చేసుకుంది. ఈ సినిమాపై సినీ ప్రముఖులు ప్రశంసలు కురిపిస్తున్నారు. తాజాగా ఈ సినిమాను ఉద్దేశిస్తూ అగ్ర కథానాయకులు రజనీకాంత్,నాగార్జున పోస్ట్‌లు పెట్టారు. చాలా అరుదుగా సినిమా విషయాలపై పోస్ట్ పెట్టే రజనీ 'కల్కి' చిత్రబృందంపై ప్రశంసలు కురిపించడంతో ప్రభాస్ అభిమానులు సంబరపడుతున్నారు. కల్కి' అద్భుతంగా ఉంది. ఇండియన్ సినిమాను నాగ్‌అశ్విన్ మరో స్థాయికి తీసుకెళ్లారు. ఇందులో నటించిన వారికి, ఈ సినిమా కోసం పనిచేసిన అందరికీ శుభాకాంక్షలు. దీని రెండోభాగం కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నా' అని రజనీకాంత్ పేర్కొన్నారు. ఈ పోస్ట్‌కు దర్శకుడు నాగ్ అశ్విన్ రిప్లై ఇస్తూ.. మాటలు రావడం లేదన్నారు. టీమ్ అందరి తరఫున కృతజ్ఞతలు చెప్పారు. నాగార్జున కూడా సోషల్ మీడియా వేదికగా టీమ్‌కు అభినందనలు తెలిపారు. 'నాగ్ అశ్విన్ మిమ్మల్ని ఒకసారి కలవాలి. అమితాబ్ మీరు అసలైన మాస్ హీరో.. మీ నటనతో మరోసారి ఆశ్చర్యపరిచారు. పార్ట్2లో కమల్ హాసన్‌ని చూడడం కోసం వేచిచూస్తున్నా. ప్రభాస్ నువ్వు మరోసారి సత్తా చాటావు. దీపికా చాలా అద్భుతంగా నటించారు. మీరంతా కలిసి ఇండియన్ సినిమా స్థాయిని మరోసారి నిరూపించారు' అని ప్రశంసించారు. మరోవైపు 'కల్కి'పై ప్రశంసలు కురిపిస్తూ హాలీవుడ్ మీడియా కథనాలు రాసింది. ప్రముఖ హాలీవుడ్ మీడియా సంస్థ డెడ్ లైన్ 'కల్కి' అద్భుతంగా ఉందని పేర్కొంది. దీంతో ప్రభాస్ అభిమానులు ఈ విశేషాలను షేర్ చేస్తున్నారు.



## ప్రముఖ బాలీవుడ్ టీవీ నటికి క్యాన్సర్

ప్రముఖ బాలీవుడ్ టీవీ నటి హీనాఖాన్ స్టేజ్ 3 బ్రెస్ట్ క్యాన్సర్‌తో బాధపడుతున్నట్లుగా తన అధికారిక ఇన్‌స్టా ఖాతాలో పోస్ట్ చేశారు.ప్రముఖ టీవీ సీరియల్ 'ఏ రిస్తా క్యా కెహ్‌లాతా హై'తో ఆమె ఎందరో అభిమానులను సొంతం చేసుకున్నారు. తన కుటుంబసభ్యులు, స్నేహితుల సహకారంతో క్యాన్సర్ మహమ్మారితో పోరాటం చేస్తున్నానని తెలిపారు. ప్రస్తుతం చికిత్స కొనసాగుతోందని, దీని నుంచి కచ్చితంగా బయటపడగలననే నమ్మకం ఉందని ఆమె సోషల్‌మీడియా వేదికగా రాసుకొచ్చారు. అభిమానులు తన ఆరోగ్యం కోసం ప్రార్థనలు చేయాలని కోరారు. కాగా హీనాఖాన్ పోస్ట్‌పై తోటి నటులు, అభిమానులు స్పందిస్తూ.. మీపై ప్రేమాభిమానాలు, గౌరవం ఎప్పటికీ ఉంటాయని, త్వరగా కోలుకొని మా ముందుకురావాలని పోస్టులు పెట్టారు. బాలీవుడ్ టెలివిజన్ పరిశ్రమలో అత్యంత ప్రజాదరణ పొందిన నటీనటులలో హీనాఖాన్ ఒకరు. ప్రముఖ టీవీ సీరియల్ 'ఏ రిస్తా క్యా కెహ్‌లాతా హై'లో ఆమె పోషించిన అక్షర పాత్ర ప్రజల్లో ఎంతో ఆదరాభిమానాలు పొందింది. అంతే కాకుండా హీనా బిగ్ బాస్, ఖత్రోన్ కే ఖిలాడీ వంటి రియాలిటీ షోలలో పాల్గొన్నారు.




## కల్కి పార్ట్-2 కూడా ఉంటుందన్న అశ్వినీదత్

### వచ్చే ఏడాదికల్లా సిద్ధం చేస్తామని వెల్లడి

ప్రస్తుతం బాక్సాఫీస్ వద్ద రికార్డులు సృష్టిస్తోంది 'కల్కి 2898 ఏడీ'. ప్రభాస్ కథానాయకుడిగా నాగ్ అశ్విన్ దర్శకత్వంలో వచ్చిన ఈ చిత్రం రెండు రోజుల్లో రూ.298.5 కోట్లు వసూలుచేసింది. రూ.500 కోట్లు నేడో, రేపో దాటడం ఖాయమైపోగా, రూ.1000 కోట్ల వైపు వడివడిగా అడుగులు వేస్తుందని సినీవర్గాలు అంచనా వేస్తున్నాయి. 'కల్కి' విజయపథంలో నడుస్తున్న సందర్భంగా చిత్ర నిర్మాత అశ్వనీదత్ మీడియాతో మాట్లాడారు. ప్రభాస్, అమితాబ్ బచ్చన్, కమల్‌హాసన్, దీపిక పదుకొణె వంటి అగ్రతారలపై ఉన్న నమ్మకంతోనే 'కల్కి'ప్రాజెక్ట్ మొదలుపెట్టడానికి కారణమని తెలిపారు. ముఖ్యంగా నాగ్ అశ్విన్ విజువలైజేషన్‌కు హ్యాట్సాఫ్ చెప్పాలన్నారు. మహానటి' చేసిన తర్వాత ఎంత పెద్ద సినిమా అయినా తీయగలడన్న నమ్మకం కలిగింది. అదే మా అమ్మాయిలకు చెప్పా. అతడు ఏ స్జబెక్ట్ చెప్పినా వద్దని చెప్పకుండా ముందుకువెళ్లమని చెప్పా. కల్కి' చూసిన సినీ పెద్దలంతా నాగ్ అశ్విన్ టేకింగ్‌ను మెచ్చుకుంటున్నారు. అమితాబ్ పాత్ర విషయంలోనూ నాగీ అనుకున్నది అనుకున్నట్లుగా తీశాడు. ప్రచార కార్యక్రమాల్లో ఆయన నా కాళ్లకు నమస్కారం పెట్టడంతో ఒక్కసారిగా షాకయ్యా. ఇక కృష్ణుడి పాత్రకు ముందుగా ఎవరినీ అనుకోలేదు. అందుకే సినిమాలోనూ ఆ పాత్ర ముఖాన్ని రివీల్ చేయలేదు. ఈ మూవీ మొదలుపెట్టే ముందు లెజెండరీ దర్శకుడు సింగీతం శ్రీనివాసరావుతో మాట్లాడాం. ఆయన కొన్ని చక్కటి సూచనలు చేశారు. అవి సినిమాకు హెల్ప్ అయ్యాయి. ఇక బుజ్జి కాన్సెప్ట్ అంతా నాగ్ అశ్విన్‌దే. సుప్రీం యాస్కిన్ పాత్ర కోసం తొలుత కమల్‌హాసన్‌ను అనుకోలేదు. అర్జునుడిగా విజయ్ దేవరకొండ సహా మిగిలిన వాళ్లందరినీ మొదటినుంచే అనుకున్నాం. సినిమా కథా చర్చల్లో ఉండగానే రెండు భాగాలుగా చేయాలన్న ఆలోచన వచ్చింది. ఎప్పుడైతే కమల్‌హాసన్ ఇందులో భాగం అయ్యారో అప్పుడే రెండు భాగాలు చేయాలని కచ్చితంగా నిర్ణయం తీసుకున్నాం. కల్కి పార్ట్-2కు సంబంధించి కొంతమేర చిత్రీకరణ పూర్తయింది. కొన్ని కీలక సన్నివేశాలు, వీఎఫ్‌ఎక్స్ పనులు పూర్తి చేయాల్సి ఉంది. అందుకు ఏడాదిపైనే పట్టొచ్చు. రెండో భాగం విడుదలపై ప్రస్తుతానికి ఎలాంటి తేదీ అనుకోలేదు. వచ్చే ఏడాది ఇదే సమయానికి రావచ్చు. 'కల్కి2' వరకే కథ అనుకున్నాం. పార్ట్-3గురించి ఇంకా ఏమీ అనుకోలేదన్నారు. మా టీమ్ అంతా విజయాన్ని ఆస్వాదిస్తోంది. సినిమా షూటింగ్ సమయంలో ఆర్థికంగా ఎలాంటి ఇబ్బందీ పడలేదు. సినిమా కోసం రూ.600 కోట్లు పెట్టే ధైర్యం ఇచ్చింది ప్రభాస్, కమల్, అమితాబ్ బచ్చన్‌లే. సెకండాఫ్‌లో కమల్‌హాసన్ పాత్ర కచ్చితంగా బీభత్సం సృష్టిస్తుంది. ఆయన నటన గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ఇన్నేళ్ల కెరీర్‌లో నాతో కలిసి పనిచేసిన నటీనటులు, టెక్నీషియన్‌లకు ఎప్పటికీ రుణపడి ఉంటానని అశ్వీనీదత్ అన్నారు.

## పూర్తి కావస్తున్న హరిహరవీరమల్లు




పవన్ కల్యాణ్ హీరోగా తెరకెక్కుతున్న పీరియాడికల్ చిత్రం 'హరిహర వీరమల్లు' 'ధర్మం కోసం యుద్ధం' అనేది ఉపశీర్షిక. తొలుత ఈ చిత్రానికి క్రిష్ జాగర్లమూడి దర్శకత్వం వహించారు. ఆయన మరో చిత్రంతో బిజీగా ఉండటం వల్ల ఆయన పర్యవేక్షణలో జ్యోతి కృష్ణ సినిమాను పూర్తి చేయనున్నారు. మెగా సూర్య మూవీస్ పతాకంపై ఎ.ఎం.రత్నం ఈ చిత్రాన్ని భారీ బ్జడెట్‌తో నిర్మిస్తున్నారు. ఇప్పటికే ఈ చిత్రం నుంచి విడుదలైన గ్లింప్స్ టీజర్స్, పోస్టర్స్ విపరీతంగా సినిమాకు హైప్ ఇచ్చాయి. సినిమా ఆగిపోయిందని, షూటింగ్ జరగడం లేదని ఎన్ని ప్రచారాలు జరిగినా సినిమాకు క్రేజ్ మాత్రం తగ్గలేదు. నెగటివ్‌గా పబ్లిసిటీ జరిగిన ప్రతిసారీ చిత్రం బృందం అప్‌డేట్ ఇస్తూనే ఉంది. ఇప్పటికే ఈ చిత్రం 50 శాతానికి పైగా చిత్రీకరణ పూర్తయింది. పవన్ కల్యాణ్ చేయాల్సింది 20 నుంచి 25 రోజులు మాత్రమే. తాజాగా ఈ చిత్రం గురించి నిర్మాత ఎ.ఎంరత్నం లేటెస్ట్ అప్‌డేట్ ఇచ్చారు. ఓ మీడియాతో మాట్లాడిన ఆయన సినిమా విశేషాలను వెల్లడించారు. 'పవన్ కల్యాణ్ షూటింగ్ చాలావరకూ పూర్తయింది. ఇంకో 20-25 రోజులు ఆయన షూటింగ్ చేస్తే సినిమా పూర్తవుతుంది. అది కూడా ఆయన వీలునుబట్టి త్వరలోనే పూర్తి చేసే ఎ÷-లాన్ చేస్తున్నారు. అమెజాన్ ఓటీటీ హక్కులు తీసుకుంది. వారి అగ్రిమెంట్ ప్రకారం సినిమా అక్టోబర్‌లో విడుదల కావాలి. వాళ్లని రిక్వెస్ట్ చేసి విడుదల కాస్త వెనక్కి తీసుకెళ్తాం. ఈ ఏడాదిలోనే సినిమాను విడుదల చేయడానికి ప్రయత్నం చేస్తున్నాం. మాగ్జిమం డిసెంబర్‌లో సినిమా ప్రేక్షకుల ముందుకొస్తుంది. షూటింగ్ పెండింగ్ ఉన్నా సినిమా పని జరుగుతూనే ఉంది. మచిలీపట్నం పోర్ట్ సీక్వెన్స కొన్ని సీన్స ఉన్నాయి.

Printed, Published and Owned by M.RAMESH, H.No. 87/-569, Ground floor, Madhavanagar, Kurnool City, Kurnool - 518002, Andhrapradesh State, and Printing at PSR Printers, No.87-569, Beside, Chenchureddy Apartment, Madhava nagar,Kurnool - 518002 District, Andhrapradesh, Published from H.No. H.No. 87/-569, Ground floor, Madhavanagar, Kurnool City, Kurnool - 518002, Andhrapradesh, Editor : M.RAMESH, Mob : 8008622746,E-mail : peoplesmotivation22@gmail.com